# మార్పు

''కాయ్ రాజా కాయ్! ఐదుకి పది, పదికిరవై, యాభైకి వంద, వందకి రెండొందలు. కాయ్ రాజ్ కాయ్! అడుగు ముందుకేస్తే అదృష్టం మీ వెంటే..'' అంటూ సినిమాహాల్ పక్కనుండి మాటలు గట్టిగా వినవస్తున్నాయ్.

అటుగా దృష్టిసారించాడు రామబ్రహ్మం. అప్రయత్నంగా అక్కడికి చేరుకున్నాడు. అక్కడ జరుగుతున్నదంతా ఎంతో పరీక్షగానూ, ఆసక్తిగానూ చూస్తున్నాడు. తన కళ్లను తనే నమ్మలేకపోయాడు.

అక్కడున్న పది పదిహేనుమందిలో ఎవరో ఒక్కరిద్దరు తప్ప మిగిలినవాళ్లంతా ఎంతో కొంత పందెం కాయడం, రెట్టింపు డబ్బు తీసుకోవడం చూసాక ఆగలేకపోయాడు బ్రహ్మం.

జేబులో వున్న ఆ వంద నోటు కాస్త బ్రహ్మం చేతిలోకి వచ్చేసింది. నెలాఖరు కావడం చేత చంటివాడి పాలడబ్బాకోసం ఎంతో మొహమాటపడిపోతూ అడగలేక అడగలేక అభిమానం అడ్డొచ్చినాసరే గత్యంతరం లేక క్లోజ్‌ఫ్రెండ్ శంకరరావు దగ్గర అప్పుగా తీసుకున్న వంద నోటది. ఆ విషయాన్ని కూడా మరచిపోయేలా చేసిందా గారడీ.

మూడు ముక్కల్లో రెండు ఇస్పేట్ ఆసులయితే, ఆ మూడో ముక్క ఇస్పేట్ కింగ్. తన హస్తలాఘవంతో ఆ మూడు ముక్కల్నీ ఇటూ అటూ మార్చేస్తూ వరుసలో పడేసి పందెం కాయమంటున్నాడా మాయలోడు.

పందెం కాసేవాళ్లంతా ఇస్పేట్ కింగ్ ఇదేనంటూ ఏదో ఒక ముక్కమీద డబ్బు వుంచాలి. కింగ్‌మీద కాసేవాళ్లందరికీ రెట్టింపు డబ్బిస్తాడు. లేకుంటే ఆ డబ్బు కాస్తా అతగాడి జేబులోకి వెళ్ళిపోతుంది.

ఈ తమాషా చూస్తూ అట్టేసేపు ఆగలేక వంద నోటు కాస్తా పోగొట్టుకుని బిక్కమొహం వేస్తూ అక్కడే నిలబడి వెర్రిచూపులు చూస్తున్నాడు రామబ్రహ్మం.

'చంటివాడి పాలడబ్బాకని అప్పుచేసి తెచ్చిన వందకాస్తా మూడుముక్కలాటలో పోగొట్టుకోవడం ఎంత నీచమైన పని? ఏ మొహం పెట్టుకుని



ఇంటికెళ్ళాలి? ఒకసారి అప్పుచేయడంలో అర్థముంది. కానీ మళ్లీ వేరొకరి వద్ద అప్పుచేయడం అన్నది ఎంతవరకూ సమంజసం? నేను చేసిన ఈ తప్పుడు పనివల్ల ఇంటాబయటా కూడా కట్టుకథ అల్లాల్సిన దుర్గతి పట్టిందే!' ఇలా ఆలోచిస్తున్న బ్రహ్మం కళ్ల నుండి నీళ్లు జలజలా రాలిపడ్డాయి.

ఆ పందెంలో గెలిచిన వాళ్ళంతా ఆ గారడీవాడి మనుషులేనని, ఓడిపోయిన వాళ్ళంతా పాపం అమాయకపు జనాలేనని గ్రహించిన ఓ పెద్దమనిషి బాగా డబ్బున్నవాడు కావడంతో తన జేబులోంచి వెయ్యి నోటొకటి తీసి, ఆ మూడు ముక్కల్లో ఒకదానిమీద వుంచాడు. అది ఇస్పేట్ కింగ్ అని అతనికి ఘంటాపథంగా తెలుసు. దాంతో ఆ గారడీవాడికి ముచ్చెమటలు పోసాయి. చేసేదిలేక ఇంతసేపూ తాను మోసగిస్తూ కాజేసిన ఎనిమిదొందలకు తనవద్దనున్న రెండొందలూ కలిపి వెయ్యికి వెయ్యి ఇచ్చేసి తెల్లమొహం వేసాడతడు.

ఆ ఆటలో డబ్బు పోగొట్టుకున్న వాళ్ళందరికీ బుద్ధొచ్చేటట్లు గట్టిగా నాల్గు చీవాట్లు పెట్టి వాళ్ళ డబ్బు వాళ్ళకి ఇచ్చేసాడు.

ఆ మిగిలిన రెండొందలూ ఆ గారడీవాడి చేతిలో పెట్టేసి, కష్టపడి బ్రతకడంలో ఆనందం, తృప్తీ రెండూ వుంటాయని, ఇలా జనాల్ని మోసగించడం వల్ల ఎప్పుడో ఒకప్పుడు మోసపోవలసి వస్తుందని రకరకాలుగా చెప్పడంతో అతనిలో కూడా పరివర్తన కలిగింది.

ఇక మన బ్రహ్మం చేసిన తప్పునకు నొచ్చుకుంటూ మరెప్పుడూ ఇలాంటి తప్పుడు పనులు చేయనని ఒట్టేస్కుని ఆ పెద్దమనిషికి చేతులెత్తి దండం పెట్టాడు కృతజ్ఞతాపూర్వకంగా!

''చూడు నాయనా! మోసపోయే వాళ్ళున్నంతకాలం ఇలాంటి మోసాలు జరుగుతూనే వుంటాయి. మనసు బలహీనపడితే మనిషి మనుగడే కష్టమైపోతుంది. ఈ సత్యం తెలుసుకుని ఇకనైనా బుద్ధిగా మసలుకో'' అన్నాడా పెద్దాయన.

అప్పటికే జ్ఞానోదయమైన బ్రహ్మానికి అతని మాటల్లో మరింత సత్యం గోరించింది.

**-కొడుకుల సూర్య సుబ్రహ్మణ్యం**

**(జగిత్యాల)**

HERBO GALLOP CONDOMS WITH GALLOP HERBAL OIL

◂ New concept, first of its kind



Herbo Gallop
CONDOMS

*Available with Gallop Herbal Oil.*

హెర్బో గ్యాలప్ కండోమ్స్‌ను
గ్యాలప్ హెర్బల్ ఆయిల్‌తో వాడండి.

Use Herbo Gallop and enjoy the additional benefits of Gallop herbal oil

A Product From
Gangotri PHARMA PVT. LTD.
GUNTUR- 522 002.
Ph: 0863-2233764, Fax: 2354724.

KALYANI ADS